# వంశాంకురము

శ్రీ సి. సి. పున్నయ్య

"ఏమిటి బావా! చేతిలోది — ఏదో క్రొత్త పుస్తకములాగుందే" అంటూ పుస్తకమును లాక్కొని పోయింది రాణి.

నేను ఏదో పనియుండి లేచి వెళ్ళిపోయాను.

రాణి ఆ పుస్తకాన్ని చదవడం మొదలుపెట్టింది.

"నాకు వివాహమయి కాపురానికెళ్ళి అయిదారు సంవత్సరాలు పైగా అయింది. మా అత్తింటివాళ్ళు సంపన్నులు. మామగారు చనిపోయి చాలాకాలమయినా మా అత్తగారు జాగ్రత్తగా సంసారాన్ని దిద్దుకొనివస్తూ యిద్దరుఆడపిల్లలకు పెళ్ళిళ్ళుచేసి కాపరానికి పంపేసింది. ఆమె అనుదిన పూజలు, వ్రతాలు దానధర్మాలు ఆ యింటిని నిత్యకళ్యాణం, పచ్చతోరణంగా రాజిలజేస్తుండేవి. పేదసాద ఆమెయెడల అత్యంత భక్తివిశ్వాసాలతో వ్యవహరిస్తుండేవారు. కాని ఆమెకు ఒక పెద్దకొరత — అది మాకు వివాహమయి అయిదారుసంవత్సరాలు గడచినా వంశాంకురం కాగల సంతానం మాకు కలుగకపోవడం.

మావారు చాలా మంచివారు. వారికి నామీదగల ప్రేమ అవ్యాజమైనది. సంతానములేని కొరత మా అత్తగారికేకాదు: మాకూయుండేది. కంటబడిన పసిపాపనల్లా ఎత్తుకొని ముద్దాడి మిఠాయీలు, బొమ్మలు కొనిపెట్టేవారము. అంతమాత్రంచేత పరాయివాళ్ళ బిడ్డలు మా బిడ్డలగుతారా! మేము సంతానం కొరకని వేయిదేవుళ్ళకు మ్రొక్కావాళ్ళము. మేము పుణ్యనదులలోచేసిన స్నానాలు, మేము సేవించిన దేవాలయాలు లెక్కకు మించినవి. కాని వాని ఫలితం నిస్పృహనిరాశలైనవి. మా అత్తగారు నాకు ఎప్పుడు కొద్దిగా సుస్తిచేసినా నెల తప్పిందేమోనని ఆశపడి, నిరాశకాగానే చీకాకుపడేది. క్రమంగా అమెకు ఓర్పు తగ్గిపోయి సంతానంకొరకు మరొక వివాహం చేసికొనవలసినదిగా మావారి చెవులు కొరకసాగింది. కాని నన్నెంతగానో ప్రేమిస్తున్న మావారు అందుకు సుతరాం సమ్మతించలేకపోయారు. ఊళ్ళోని వాళ్ళు కొందరు మాపట్ల సానుభూతితో విచారం ప్రకటించేవారు. మరికొందరు మాకు సంతానం లేకపోవడంవలన శుభకార్యాలలో మా యునికి అపశకునంగా భావించి మమ్మలను పిలవడానికి సంకోచించేవారు.

ఒకరోజున ఉదయం మా యూరి ప్రక్కనున్న భువనేశ్వరాలయానికి ఈశ్వరార్చనకు వెళ్ళాము. వందలాది ప్రజలు భగవంతుడనుగ్రహించినందుకుగాను మొక్కుబళ్లు తీర్చుకుంటున్నారు. అందులో ఎందరో తల్లుల చేతుల్లో పసిపాపలు క్యావ్ క్యావ్‌మంటున్నారు. వారి ముఖాలపై సంతోష సంభ్రమాలు, భక్తి విశ్వాసాలు తొణికిసలాడుతున్నవి. ఇందరిని అనుగ్రహిస్తున్న భువనేశ్వరుడు మమ్మలను అనుగ్రహించి సంతానమివ్వకపోవడానికి మేముచేసిన మహాపచారం ఏమియులేదే అనుకుంటూ అర్చన ముగించుకొని యింటిముఖం పట్టాము. దారికి రుపైపుల మామిడి చెట్లున్నవి. ఆ చెట్లనీడన బాలబాలికలు ఆడుకుంటున్నారు. వాళ్ళకు దేవుడిప్రసాదం పిలిచిపెట్టాము. వారిలో ఒకడుమాత్రం ప్రసాదం తీసికోకుండా తొలగితొలగి పోసాగాడు. మాకు ఆశ్చర్యమేసింది. అందరూ ప్రసాదంకొరకు ఎగబడుతుంటే ఆ కుర్రాడు మాత్రం తొలగితొలగి పోవడమునకు కారణమేమిటాయని ఆలోచింపసాగాను —

"ఏం బాబూ! ప్రసాదం ఎందుకువద్దు? రా — వచ్చి పుచ్చుకో" అన్నాను.

వాడు మరి నాలుగడుగులు వెనక్కు వేశాడు. నేనుపోయి బ్రతిమాలి ప్రసాదం పెట్టాలని పట్టుకొని ప్రయత్నించాను. కాని తప్పించుకొని పోవడానికి పెనుగులాడసాగాడు. నేను ఎంతో బుజ్జగించి, బొమ్మలు, మిఠాయిలు కొనిపెడ్తానని ఆశపెట్టేసరికి

"మా అమ్మ, నాన్న మీదగ్గరికి పోవద్దన్నారు" అన్నాడు. నేను అప్రయత్నంగా "ఎందుకు..." అన్నాను.

"మీకు బిడ్డపాప లేరట మీరు..." అనేసరికి నా చేతులు పట్టుతప్పినవి. పిల్లవాడు తప్పించుకొని పారిపోయాడు. నేను కుప్పకూలినట్లు కూలిపోయేసరికి మావారు మెల్లగా పట్టుకొని యిల్లుచేర్చారు.

ఆనాటినుండి ఆ యూరి వాతావరణం నాకు ప్రాణ కంటకమయింది. నన్ను, నాదీనావస్థను చూస్తున్న మావారు యిక ఆవూళ్ళోనుండి లేచిపోయి ఏకానని దేశంలోనో స్థిరపడితేతప్ప ప్రశాంతమయిన జీవితముండదని నిర్ధారణ చేసికున్నారు. కాని ఇల్లు వదలడానికి ఒక్కడే కొడుకైన మావారిని తల్లివదలి యుండడానికిచ్ఛగించదు. ఇక మరిచేసేది — కాశీకి తీర్థయాత్రకు వెళ్ళి వస్తామని బయలుదేరివెళ్ళి రెండు వందల మైళ్ళ దూరంలో నున్న మద్రాసు నగరానికిచేరి కాపరం పెట్టాము. మావారు ఒక ఆఫీసులో మేనేజరుగా ఉద్యోగానికి చేరారు. అలా రెండుసంవత్సరాలు గడిచింది. ఆలోపల నేనుకాని, మావారుకాని ఎవరికి జాబులు వ్రాయలేదు. కాబట్టి మా అత్తగారికి సయితం మాయునికినిగురించి తెలియకుండాయుండింది.

ఒకరోజున ప్రస్తావనవశంగా తమకు బిడ్డలులేని కొరతనుగురించి మావారు తన ఆప్తమిత్రుడు డాక్టర్ రమేష్‌బాబుతో చెప్పాడు. అందుకాయన వెంటనే మావారిచేత మా అత్తగారికి "సీతకు నవమాసములు నిండినవి_రేపు మాపట్లో మనుమడో, మనుమరాలో" అని వ్రాయించాడు.

మా అత్తగారు ఉప్పొంగిపోయింది. పురుడు పోయడానికి వస్తున్నానని తిరుగు జబాబు వ్రాసింది. కాని మేము వెంబడే ఆమెను రావద్దనీ, మేమే అన్నప్రాశనకు అక్కడికి వస్తున్నామని వ్రాశాము.

రమేష్‌బాబు చెల్లెలు ప్రసవించి మొగశిశువును కనింది. ఆమెకు అప్పటికే గుంపెడు బిడ్డలుండి నానా యాతనలు పడుతుండుటవలన అన్న చెప్పినట్లు పుట్టిన బిడ్డను మాకిచ్చేసింది. మేమే పాలు, నీళ్ళుపోసి పెంచసాగాము. ఆరవనెలరాగానే పిల్లవాణ్ణి తీసుకొని అన్నప్రాశనకు స్వగ్రామానికి చేరాము. మా అత్తగారు పిల్లవాణ్ణి ఎత్తుకొని పరమానందభరితురాలయింది. అన్నప్రాశననాడు మా యింటికి వచ్చిన బంధుమిత్రులు మమ్ముల నభినందిస్తుంటే మా అత్తగారు పిల్లవాణ్ణి ఎత్తుకొని సగర్వంగా అభినందనాశీస్సులను స్వీకరించింది.

ఊళ్ళోవాళ్ళు, చుట్టాలు, పక్కాలు ఆ పిల్లవాడు మా బిడ్డనే అనుకొంటున్నా, మా అత్తగారు మాత్రం పిల్లవాడికి నేను పాలివ్వకపోవడం అప్పుడప్పుడు కొంత సందేహానికి కారణమయినా! యిప్పటి కాలపు తల్లులు అంతేకాబోలు ననుకొని తృప్తిపడేది.

నేను భోంచేస్తుంటే రాణి పరుగెత్తుకుంటూవచ్చి "నారపీచుగారు కథలుకూడా వ్రాస్తున్నారే" అన్నది ప్రక్కనకూర్చుని.

"నీబోటి జీరంగి చదవడానికుంటే ఎందుకు వ్రాయడూ" అన్నాను నేను.

రాణి గట్టిగా గిల్లి పారిపోయింది.

—— (o) ——

ఒకాయన టెలిఫోనులో పోలీసు ఉద్యోగితో "ఏమండీ! నా భార్య పరారై పోయింది - ఏమిచెయ్యమంటారు" అని అడిగాడు.

పోలీసు ఉద్యోగి "ఆమె పోలికలు, ఎప్పుడు పరారియైపోయినది చెప్పండి."

"ఆమె అయిదు అడుగులఎత్తు, సన్నగా, మెల్లకన్నుతో నుంటుంది. పరారియై రెండు వారములయింది."

"ఇంత కాలం ఎందుకు రిపోర్టుచేయలేదు"

"ఈ రెండు వారాలు అది కలయేమోననుకున్నాను.